క్లుప్తంగా

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు(వ్యాఘ్రపురి క్షేత్రం) పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం తెల్లవారు జామున ప్రాతః కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమజ్జయంతి పురస్కరించుకుని జూన్ 1న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ ఉత్సవం



వలివేరు(వేమూరు): మండలంలోని వలివేరు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ పోలేరమ్మ తల్లి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి గుడి వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు, గ్రామస్తులకు వైఎస్ జగన్ యూత్ సభ్యులు ఉచిత మజ్జిగ, మినరల్ కూలింగ్ వాటర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గాదె శివ రామ కృష్ణా రెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాట్ల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, చీడేపూడి సాంబిరెడ్డి, సర్పంచ్ పందిపాటి ఏసు, ఈమని పద్మారెడ్డి, ఈమని సత్యనారాయణ రెడ్డి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంగ్లభాషపై విద్యార్థులకు అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఆంగ్ల అధ్యాపకుడు యు.పాలప్రసాద్ ఆంగ్లభాష ఉచ్చారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాటించాల్సిన మెలకువలతో పాటు ప్రిపోజిషన్స్‌ను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారంలో శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 13 నుంచి మొదలైన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సాయంత్రం స్వామికి పరివార సామ్రాజ్య పట్టాభిషేకం, మహా వైశాఖ పూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త పన్నాల వెంకటబుచ్చి రామశాస్త్రి, కార్యనిర్వాహణ అధికారి(ఈఓ) పగడాల శివకోటేశ్వరరావు, అర్చకులు సంగాపు చందు, సంగాపు చిన్న, చింతపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళి

లక్ష్మీపురం: జవహర్ లాల్ నెహ్రూ విధానాలు అనుసరణీయమని విశ్రాంత ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడారు. అనంతరం ఎన్టీఆర్ జయంతి సభ నిర్వహించారు.

వంతెనలు శిథిలం.. చర్యలు శూన్యం

- కాలువలపై శిథిలావస్థకు చేరిన వంతెనలతో ఇక్కట్లు
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామల ప్రజల వినతి

పిట్టలవానిపాలెం: మండలంలోని పంట కాలువలపై ఏర్పాటు చేసిన పలు వంతెనలు కాలం చెల్లిపోవడంతో ప్రమాదకరంగా మారాయి. చోడిపాలెం శివారులోని ఆరెమండ్ల పంట కాలువపై నిర్మించిన వంతెన శిథిల స్థితికి చేరింది. నిత్యం దీనిపై వాహనదారులు బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఈ వంతెనపై నుంచే తరలిస్తుంటారు. ఈ వంతెన నిర్మించి దశాబ్దాలు కావడంతో శిథిల స్థితికి చేరుకుంది. వంతెన ఏక్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. శిథిల వంతెనను తొలగించి దీని స్థానంలో కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థలో చోడిపాలెం వంతెన



ప్రమాదకరంగా వంతెన సైడ్ వాల్స్



శిథిలావస్థకు చేరటంతో ఇనుప చువ్వలు పైకి లేచిన దృశ్యం

పట్టించుకున్న నాథుడు లేడు..



వంతెన గురించి పట్టించుకున్నవారు లేకుండా పోయారు. గత కొన్నేళ్లుగా శిథిల వంతెన గురించి పాలకులకు, అధికారులకు తెలియజేస్తూనే ఉన్నాము. అదిగో చూస్తాం.. ఇదిగో చూస్తామంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా పట్టించుకున్న పాపాన పోలేదు.

–చిరసాని రామిరెడ్డి, చోడిపాలెం.

నేడు ఐలవరంకు దాస స్వామీజీ రాక



భట్టిప్రోలు: హనుమజ్జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి శిష్యులు నరేంద్ర రామానుజ దాస స్వామీజీ (శరణాగతి గోష్ఠి పీఠాధిపతులు) బుధవారం రానున్నట్లు ఎస్ఎస్ఎఫ్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ మంగళవారం తెలిపారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోగా గ్రామాల్లో చిన్నారులకు ఆధ్యాత్మిక, సృజనాత్మక అంశాల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు. ఇంటింటా ధర్మ ప్రచారం చురుగ్గా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. టీటీడీ, ఎస్ఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార కాలనీల్లో దేవాలయాల అర్చకులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం

గోవింద నామస్మరణతో మారోగ్మిన వేంకటేశుని ఆలయ ప్రాంగణం



కల్యాణంలో పాల్గొన్న వేద పండితులు

నగరం: భక్తుల గోవింద నామ స్మరణతో గిరిపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణం మార్మోగింది. దేవస్థాన 14వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయంలో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేద పండితులు శాస్త్రయుక్తంగా స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. సాయంకాల సమయంలో గరుడోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిపించారు. నగరం పుర వీధులలో గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నం మహాత్మ జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాల (బాలుర)లో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఆంగ్ల మాధ్యమంలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ విద్యార్థులకు మౌఖిక పరీక్ష జరిపి అర్హులైన వారిని ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

రేపల్లెరూరల్: బాపట్ల–రేపల్లె 132 కేవీ విద్యుత్ లైన్‌లో కండక్టర్ మార్పే నేపథ్యంలో ఈ నెల 29న మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రేపల్లె పట్టణ, మండలం లోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుతుందని ఆ శాఖ డీఈఈ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సేంద్రియ సాగుపై రైతుల ఆసక్తి

- తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు
- సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్న వ్యవసాయ అధికారులు

భట్టిప్రోలు: రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయాధికారులు సూచనలు పాటిస్తూ పశు వ్యర్థాలతో భూసారం పెంచుతున్నారు. సేంద్రియ ఎరువులతో పలువురు అధిక దిగుబడులు పొందుతూ లాభాల బాటలో పయనిస్తున్నారు. సాధారణంగా మొక్కల పెరుగుదల, నేల ఉత్పాదక శక్తికి ఉపయోగపడే పోషకాలు మన నేలల్లో తక్కువగా ఉంటాయి. ఒకే పొలంలో ఏటా పలు రకాల పంటలు పండించటంతో కొద్దిపాటి పోషకాలు తరిగిపోతున్నాయి. నేలలో వాటిని పెంచుతూ అధిక దిగుబడులు పొందాలంటే పశువుల పేడ, కంపోస్టు, బయోగ్యాస్ ప్లాంట్ల వ్యర్థాలు, పచ్చిరొట్ట తదితరాలు వినియోగించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

వేసవిలో ఆవుల మంద, గొర్రెలు పొలాలకు చేరతాయి. వీటిని ఒక రాత్రి పొలంలో కట్టివేసి వాటి మల మూత్ర విసర్జనతో పొలంలో సేంద్రియ పదార్థాలు నేలకు అందజేస్తారు. ఎకరాకు రూ.2 వేలు తీసుకొని పశువుల మందను రాత్రి వేళ కట్టేస్తారు. కొంత మంది రైతులు రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను ఉపయోగించి లాభాల బాటలో పయనిస్తున్నారు. పచ్చిరొట్ట, కంపోస్టుతో పాటు పశువుల పేడ ప్రధానమైనది. పశువుల మందను పొలంలో కట్టించటంలో సేంద్రియ పదార్థాలు భూమికి అందజేస్తున్నారు. సాధారణంగా రసాయనిక ఎరువులతో ఎకరా సాగుకు రూ. 30 వేల ఖర్చు అవుతోంది. అలా కాకుండా వాటిని తగ్గించి కొంత మేర సేంద్రియ ఎరువులు జోడిస్తే అంతే ఖర్చవుతుందని పెద్దగా తేడా ఉండదని రైతులు చెబుతున్నారు. కానీ మంచి దిగుబడులు వస్తాయని చెబుతున్నారు. రసాయనిక ఎరువుల వినియోగంతో ఎకరాకు ధాన్యం 30 బస్తాలు, మినుములు నాలుగు క్వింటాలు వస్తుంటే సేంద్రియ ఎరువులతో ధాన్యం 35 బస్తాలు, మినుములు ఆరు క్వింటాళ్లు వస్తాయి.



కంపోస్టులో పెరుగుతున్న వానపాములు

సేంద్రియ ఎరువుల్లో అధిక పోషకాలు



పశువుల పేడలో నత్రజని 0.5 నుంచి 15 శాతం, భాస్వరం 0.3 నుంచి 0.9, పొటాష్ 0.5 నుంచి 1.9 శాతం భూమికి అందుతుంది. వర్మీ కంపోస్టులో నత్రజని 1.6శాతం, భాస్వరం 0.5 శాతం, పొటాష్ 0.8 శాతం లభిస్తుంది. తద్వారా రసాయనిక ఎరువులను తగ్గించి వాడుకోవచ్చు. అధిక దిగుబడులు రావడం వల్ల రైతులకు అదనంగా ఆదాయం సమకూరుతుంది

–గొల్లపోతు మీరయ్య, వ్యవసాయాధికారి, భట్టిప్రోలు.

వయోజనులకు బీసీజీ టీకాలను వేయండి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: వయోజనులందరికి బీసీజీ టీకాలు వేయాలని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఇ.అన్నపూర్ణ ఆదేశించారు. తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లతో టీబీ యూనిట్‌లో మంగళవారం ఆమె సమీక్షా సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకునేందుకు అర్హులన్నారు. ప్రభుత్వం మొదటి విడత కింద వృద్ధులకు వేయడం జరుగుతుందన్నారు. రెండో విడత అందరికి టీకాను వేయనున్నట్లు చెప్పారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ అర్హులు తమ పేర్లను సచివాలయంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. క్రమపద్ధతిలో అందరికి టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: పట్టణంలోని భార్గవ పేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భార్గవపేటకు చైతన్య అనే యువకుడు రోజు లాగే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా కనిపించ లేదు. చోరీకి గురయిందని గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ శాలి పేటకు చెందిన 20 ఏళ్ల దొడ్డ సాయికుమార్ రెడ్డి ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నెల 27న బోస్ రోడ్డులోని సాయిబాబా గుడి వద్దకు వచ్చిన అతను తిరిగి ఇంటికి వెళ్లలేదు. యువకుడి తల్లి మంగళవారం పోలీసులను ఆశ్రయించగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాబ్ మేళా



తెనాలి అర్బన్: ఇంటర్మీడియెట్ బోర్డు, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10గంటలకు రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హెచ్‌సీఎల్ కంపెనీ కో–ఆర్డినేటర్ పి.గురునాథ్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్‌లో 75శాతం మార్కులు దాటిన బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సు పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. మూడంచెల విధానంలో ఎంపిక ఉంటుందని, ఎంపికైన వారికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చి అనంతరం హెచ్‌సీఎల్ ఉద్యోగిగా నియమించడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్ సమయంలో నెలకు రూ.10 వేలు, ఉద్యోగంలో చేరిన నాటికి నుంచి నెలకు రూ.14,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రముఖ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ కూడా చదివేందుకు సంస్థ ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. వివరాలకు గురునాథ్ మొబైల్ నంబరు 77807 54278కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన హనుమజ్జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకారంలో ప్రసన్నాంజనేయుడు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరంలోని వేణు గోపాలస్వామి దేవస్థానంలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకు టీటీడీ సహకారంతో భజన సంకీర్తనలు, ఉపన్యాస కార్యక్రమాలు, స్వామి వార్లకు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు తెలిపారు. 31 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు 24 గంటల ఏకాహం, హనుమాన్ చాలీసా, భజన సంకీర్తన పారాయణం వివిధ సమాజాలతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జయంతి పర్వదినాన స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు, సామూహికంగా ఆంజనేయ స్వామి వారికి అష్టోత్తర శత నామావళి పూజలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వీరాంజనేయ స్వామికి పూజలు



హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న మహిళలు

జంపని(వేమూరు): మండల పరిధిలోని జంపని గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం పంచామృత అభిషేకం జరిపారు. సాయంత్రం పట్టు వస్త్రాలు, పుష్ప మాలికలు, నిమ్మ ఫల మాలికలతో విశేషంగా అలంకరించారు. పెదరావూరు వాస్తవ్యులు బండ్లమూడి రాధాకృష్ణ దంపతులు తెల్ల జిల్లేడు పుష్పాలతో అష్టోత్తర సహస్రనామ పూజలు జరిపించారు. భజన సమాజాల వారు హనుమాన్ చాలీసా పారాయణ చేసి హనుమ భజన కీర్తనలు ఆలపించారు.

బాలికలకు పౌష్టికాహారం తప్పనిసరి



అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

వేమూరు: బాలికలు పౌష్టికాహారంతో పాటు ఆసనాలు, వ్యాయామాలు చేయటం వల్ల భవిషత్తులో రుతు సమస్యలు రావని మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రుతు సమస్యల నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి నెల మే 28న ప్రపంచ వ్యాప్తంగా రుతు పరిశుభ్రత దినం జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. బాలికలు శారీరక శ్రమ చేయాలని పరిశుభ్రత పాటించాలని సూచించారు. బాలికలు యుక్త వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఎలాంటి పోషకాహారం తీసుకోవాలో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విరిగిపడిన విద్యుత్తు స్తంభం

తృటిలో తప్పిన పెను ప్రమాదం



కొల్లూరు ముస్లిం గోరీల వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో విరిగిపడిన విద్యుత్తు స్తంభం

కొల్లూరు : అతివేగంగా ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొనడంతో విద్యుత్తు స్తంభం విరిగి అదే ట్రాక్టర్‌పై పడిన సంఘటన కొల్లూరులో చోటు చేసుకుంది. స్థానికులు, ట్రాన్స్‌కో సిబ్బంది కథనం మేరకు.. మట్టి లోడుతో పెసర్లంక వైపు నుంచి కొల్లూరు వస్తున్న ట్రాక్టర్ స్థానిక ముస్లిం గోరీల వద్ద రహదారిపై నిలిపి ఉన్న లారీని తప్పించే క్రమంలో వేగాన్ని అదుపు చేయడంలో డ్రైవర్ విఫలమయ్యాడు. అదుపు కోల్పోయిన ట్రాక్టర్ రోడ్డు అంచున విద్యుత్తు పోల్‌కు ఢీకొనడంతో ఆ అదటుకు పోల్ విరిగి ట్రాక్టర్ ట్రక్కుపై పడటంతో పాటు, విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. ట్రక్కుపై పడిన విద్యుత్తు స్తంభానికి ఉన్న సర్వీసు తీగల మధ్య చిక్కుకున్న ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా తీగల నుంచి ఎటువంటి విద్యుత్తు ఘాతానికి గురవకుండా బయట పడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్తంభం విరగడంతో తక్షణం స్పందించిన ట్రాన్స్‌కో సిబ్బంది విరిగిన స్తంభం స్థానంలో నూతన పోల్ ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

చేతిరాత నైపుణ్యంతో జీవితంలో ప్రగతి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాత నైపుణ్యంతో చదువులో ప్రతిభ చాటడంతో పాటు జీవితంలో ప్రగతి సాధించవచ్చునని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో స్తంభాల గరువులోని చేబ్రోలు మహాలక్ష్మి– పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు నిర్వహిస్తున్న చేతిరాత శిక్షణ తరగతులను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పొత్తూరు జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఉప్పాల రామమోహనరావు సారథ్యంలోని శిక్షణ తరగతులకు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకోవడం ద్వారా విద్యార్థులు చదువులో ప్రతిభ చూపగలరని తెలిపారు. చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా మానసికంగాను మార్పులు సంభవిస్తాయని, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరు ఒక బృందంగా ఏర్పడి, చేతిరాత నైపుణ్యంపై తోటి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ బుధవారం ముగియనున్న మూడు రోజుల శిక్షణ తరగతులకు 38 మంది ఉపాధ్యాయులతో పాటు 57 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. శిక్షణ తరగతుల్లో క్యాలీగ్రఫీ రీసోర్స్ పర్సన్లు తొరటి శ్రీనివాసరావు, బురాన్, ప్రసాద్, నాగమణి, శారద, నాగలక్ష్మి, రమాదేవి, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.